క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సీతంపేట: మండలంలోని కారిమానుగూడలో జరుగుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను ఎంపీడీఓ కె.గీతాంజలి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడారు. రోజుకు ప్రతీ వేతనదారునికి రూ.257 వేతనం వచ్చేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. రికార్డులు చూశారు. కార్యక్రమంలో ఏపీఓ సాగర్ పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న హెచ్‌ఎం లిల్లీరాణి

సీతంపేట: పదో తరగతి పరీక్షలు బాగా రాయాలని స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి అన్నారు. పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరు విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు 92 మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌సీని సందర్శించిన జిల్లా గణాంకాధికారి


సీహెచ్‌సీలో నివేదికలను పరిశీలిస్తున్న జిల్లా గణాంకాధికారి శంకరరావు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి సీహెచ్‌సీని జిల్లా గణాంక అధికారి సిహెచ్.శంకరరావు మంగళవారం సందర్శించారు. డిప్యూటీ డైరెక్టర్ డెమోగ్రఫీ విజయవాడ వారి ఆదేశాలు, జిల్లా వైద్యాధికారుల సూచన మేరకు ఆస్పత్రిలో సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్, హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, అన్ని జాతీయ కార్యక్రమాల నివేదికల పనితీరు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ ఎన్ కిరణ్, టెక్నికల్ ఇంజినీర్ జగదీష్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


డ్యాన్స్‌లు చేస్తున్న విద్యార్థులు

పాలకొండ: పట్టణంలోని పెదకాపు వీధి ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సినీ, శాస్త్రీయ సంగీతాలకు విద్యార్థులు డ్యాన్స్‌లు చేసి అలరించారు. అనంతరం పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జామి రవి, కౌన్సిలరు దుప్పాడ పాపినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం


గ్రంథాలయం కోసం ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్

గుమ్మలక్ష్మీపురం: గ్రంథాలయాన్ని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని శాఖా గ్రంథాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయంలో పాఠకుల కోసం ఉన్న పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాలయంలో ఉండే సౌకర్యాలు, అసౌకర్యాలపై నిర్వాహకురాలు సుకన్యను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ జె.రాములమ్మ, సర్పంచ్ బి.గౌరీశంకరరావు ఉన్నారు.

ఖాతాలో జమ చేయాలి

గరుగుబిల్లి: ఎండీయూ వాహనాలకు సంబంధించిన ఇన్సురెన్స్ నగదును బ్యాంకు ఆఫ్ బరోడ అధికారులు ఎండీయూ ఆపరేటర్ల ఖాతాల నుంచి జమ చేసుకుంటున్నారని, ఆ నగదును తిరిగి తమ ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని ఉప తహసీల్దార్ శివన్నాయుడుకు ఆపరేటర్లు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎండీయూ ఆపరేటర్లకు బీమా సదుపాయాన్ని కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని కోరారు. ఐసీడీఎస్‌కు పంపిణీ చేసే ఎండీఎం బియ్యానికి కమిషన్ ఇప్పించాలన్నారు.


వీరఘట్టం: చిట్టపులివలసలో ఉత్సాహంగా రాగిజావను స్వీకరిస్తున్న విద్యార్థులు


కొమరాడ: రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంఈఓ నారాయణస్వామి తదితరులు


వీరఘట్టం: బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు రాగిజావను అందజేస్తున్న జెడ్పీటీసీ కన్నతల్లి, ఎం.ఈ.ఓ కృష్ణమూర్తి తదితరులు


పాలకొండ రూరల్: భాసూరులో విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న ఎంపీపీ బొమ్మాళి భాను


కురుపాం: విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఆరోగ్యమస్తు...

విద్యార్థుల ఆరోగ్యమే భాగ్యంగా భావిస్తున్న రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పౌష్టికాహారం అందజేస్తోంది. తాజాగా మంగళవారం నుంచి ఉదయం పూట పాఠశాలల్లో రాగి జావ పంపిణీకి శ్రీకారం చుట్టింది. రాగి జావతో మరింత ఆరోగ్యాన్ని ఇవ్వాలని సంకల్పించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పండుగలా దాని పంపిణీని చేపట్టింది. దీంతో పాఠశాలల్లో సందడి నెలకొంది. కార్యక్రమాల్లో సర్పంచ్ నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీ వరకు, అలాగే ఎంఈఓలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


జియ్యమ్మవలస: బిత్రపాడు పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు


గరుగుబిల్లి: విద్యార్థులకు రాగిజావను వేస్తున్న ఎంఈఓ నాగభూషణరావు


పాలకొండ: ఓని పాఠశాలలో రాగిజావతో విద్యార్థులు


సీతంపేట: రాగిజావ పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఏఎంసీ చైర్మెన్ తదితరులు


భామిని: విద్యార్థులకు రాగిమాల్ట్ అందజేస్తున్న తోట సింహచలం, ఎంఈఓ శ్రీనివాసరావు


గుమ్మలక్ష్మీపురం: జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు రాగిజావను అందిస్తున్న వైస్‌ఎంపీపీ, సర్పంచ్

పల్లెల్లో పంచాంగ శ్రవణం


గరుగుబిల్లి: నాగూరులో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న పెద్దలు, రైతులు


జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న రైతులు

గరుగుబిల్లి: మండలంలోని రావివలస, పెద్దూరు, గరుగుబిల్లి, రావుపల్లి, చినగుడబ, నాగూరు తదితర గ్రామాలలో పంచాంగ శ్రవణం కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఆయా గ్రామాలలో అర్చకులు కొత్త సంవత్సరం ఉగాది సందర్భంగా శోభకృత నామ సంవత్సర పంచాంగంలో శుభ, అశుభ ఫలితాలను, వర్ష ఫలితాలను తెలిపారు. రైతులు బుధవారం ఏ సమయంలో నాగళి ద్వారా దుక్కిని చేయాలి, వ్యాపారులు కొత్త ఖాతాలను ఎప్పుడు తెరవాలి, నూతన వస్తువులను ఏ సమయంలో కొనుగోలు చేయాలి తదితర విషయాలను వివరించారు. ముఖ్యంగా ఈ ఏడాది రైతులకు ఏఏ రకమైన పంటలు కలిసి వస్తాయి, వర్షం, రాశుల ఫలాలు తదితర విషయాలను వివరించారు. ఆయా గ్రామాలలో జరిగే పంచాంగ శ్రవణం కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలసలో..

జియ్యమ్మవలస: మండలంలోని చాలా గ్రామాలలో మంగళవారం అమావాస్య కావున రైతులు పంచాంగ శ్రవణంలో మునిగిపోయారు. మంగళవారం మధ్యాహ్నం గ్రామ పురోహితులు కృష్ణారావు రామ మందిరం వద్ద రైతుల సమక్షంలో పంచాంగ శ్రవణం వినిపించారు. ఉగాది పచ్చడి తయారు చేసి పూజ అనంతరం రైతులకు పంచిపెట్టారు.

సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

కురుపాం: మండలంలో సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కురుపాం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని సందర్శించి అక్కడ వస్తున్న వార్తా పత్రికలు, ఉద్యోగ సమాచార పత్రికలు, పుస్తకాలతో పాటు అందుతున్న సేవలపై గ్రంథాలయ ఉద్యోగి అమ్మనబోలు శ్రీనువాసరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రస్తా కుంటుబాయి గ్రామంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం సందర్శించి అక్కడ సాగు చేస్తున్న నూతన వంగడాలు, గిరిజన రైతులకు ఏమేరకు సేవలు అందుతున్నది కేవీకే కార్యక్రమం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ రమేష్‌కుమార్, ఆర్ఐ ప్రసాద్ ఉన్నారు.


రస్తాకుంటుబాయి గ్రామంలో కేవీకేను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

ఉగాది అంటే హలకర్మ

భామిని: ఉగాది అనగానే షడ్రుచుల పచ్చడి, పుత్తిడి కొనుగోలు, కొత్త ఖాతాలు ఆరంభం చేయడం ఆనవాయితీ. గ్రామీణ ప్రాంతంలో మాత్రం కొత్త తెలుగు సంవత్సరంగా పిలిచే ఉగాది రోజున హలకర్మతో రైతులు వ్యవసాయ పనులు పవిత్రంగా ప్రారంభిస్తారు. ఉగాది అంటేనే రైతు ముహూర్తం ప్రకారం ఏరువూత చేపడతారు. మండలంలో ఉగాది వేడుకలకు రైతు కుటుంబాలు సిద్ధమయ్యాయి. కొత్త పంచాంగం ముహూర్తం ప్రకారం వ్యవసాయ పనులు హలకర్మతో చేపడతారు.


కొత్త నాగళ్ళు చేయిస్తున్న రైతులు

పిల్లల ఎదుగుదలతోనే సంతోషం

పాలకొండ రూరల్: బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆ పిల్లల ఎదుగుదల తల్లితండ్రులకు ఎంతో సంతోషం ఇస్తుందని ఎంఈఓ మీసాల సూర్యనారాయణ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో వరల్డ్ డౌన్ సింద్రోమ్ డేను పురస్కరించుకుని ప్రత్యేక అవగాహనా కార్యక్రమం మంగళవారం చేశారు. డౌన్ సింద్రోమ్ అనే జన్యు సమస్యతో బాధపడే పిల్లల్లో ఎదుగుదల తగ్గిపోతుందని, మందకోడితనం ఏర్పడుతుందన్నారు. దీనిని సకాలంలో గుర్తించి సరైన చికిత్స అందిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఐఈఆర్టీ అరుణ అన్నారు.

ఓటమి విజయానికి నాంది

- మీ భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది
- రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

వీరఘట్టం: పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని, పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని ఎవరూ కుంగిపోవద్దని ప్రతీ ఓటమి విజయానికి నాంది అని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆయన వీరఘట్టంలోని సెయింట్ జేవియర్స్ స్కూల్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ పాఠశాల అగ్నిమాపక నిబంధనలు పాటిస్తూ లైసెన్సు పొందిన పాఠశాల కావడంతో ఈ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థి దశ నుండే మీ భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. గొప్ప చదువులు చదివిన తర్వాత ఉన్నత ఉద్యోగాలు సాధించిన వారు తమ కన్న ఊరును, జన్మభూమిని మరువకూడదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలన్నారు.అలాగే వ్యవసాయం అభివృద్ధికి రైతన్నలకు తోడ్పాటు అందించాలని, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలన్నారు. దేశాభివృద్ధికి పాటుపడిన ఎందరో మహానుభావుల జీవిత గాథలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల యాజమాన్యంతో మాట్లాడారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించి ఇక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. సుమారు నాలుగు గంటల సమయం పాఠశాలలో విద్యార్థులతో గడిపి పలు అంశాలను చర్చించారు. అంతకు ముందు పాఠశాల ప్రిన్సిపాల్ మెర్లీ, వైస్ సిస్టర్ రోస్‌మేరీ, సిస్టర్ మెహర్‌బుల్, కరస్పాండెంట్ దనరాజ్‌లు అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌కు ఘనంగా స్వాగతం పలికారు.


పాఠశాల పరిస్థితులు, విద్యా ప్రమాణాలపై సిబ్బందితో మాట్లాడుతున్న డీజీ మాదిరెడ్డి ప్రతాప్

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ కేంద్రంలో స్వల్పకాలిక కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌కు కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణత, ఫోర్ వీలర్ సర్వీస్ అసిస్టెంట్‌కు విద్యార్హత ఎనిమిదో తరగతి, అసిస్టెంట్ ప్లంబర్‌కు ఐదో తరగతి, సీయింగ్ మిషన్ ఆపరేటర్‌కు కనీస విద్యార్హత ఐదో తరగతిగా నిర్ణయించామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హత ధ్రువపత్రాలు, 2 పాస్ ఫొటోస్, ఆధార్ లింక్ మొబైల్‌తో పాటు బ్యాంక్ అకౌంట్ వివరాలతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 6304033963, 9948582309 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

పాలకొండ రూరల్: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు అన్నారు. జిల్లా అంధత్వ నివారణా సంస్థ నేతృత్వంలో మంగళవారం అంపిలి గ్రామంలో మూడవ విడత డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం చేపట్టారు. వైద్యులు రామకృష్ణ గ్రామంలో నేత్ర సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి పరీక్షలు చేపట్టారు. అవసరమైన మందులు, కంటి అద్దాలను అందించారు. వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్ పరిశీలన

సీతంపేట: ఆధార్ క్యాంప్‌ను డీఎల్‌డీఓ గోపాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఆధార్ అప్డేట్ వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. పది సంవత్సరాలుగా అప్‌డేట్ చేయని వారు చేయించుకోవాలన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కూడా ఆధార్ క్యాంప్‌లు దారపాడు, సీతంపేట, గొయిది, కుడ్డపల్లి సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు పెట్టనున్నామన్నారు. ఎంపీడీఓ కోసూరు గీతాంజలి, గ్రామ కార్యదర్శి సుదర్శనరావ పాల్గొన్నారు.

నేటి నుంచి మజ్జి గౌరమ్మ ఉత్సవాలు



భామిని: మండలంలోని బిల్లుమడలో వెలసిన మజ్జి గౌరమ్మ 15వ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం నుంచి జరగనున్నాయి. ఈ ఉత్సవాలు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అటవీ సంరక్షణపై అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జనార్ధననాయుడు

పాలకొండ రూరల్: అటవీ సంరక్షణ సమాజానికి మేలు చేకూరుస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.జనార్ధననాయుడు అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ, ఇకో క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన అటవీ శాఖ అధికారి తవిటినాయుడు మాట్లాడుతూ జిల్లాలో అటవీ విస్తీర్ణం, సంపదలు, జంతు, వాటి సంరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్, బి.రాజు, ఉపన్యాసకులు వి.జనార్ధన నాయుడు, పి.ఉపేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్మీడియెట్ పరీక్షలు

- సబ్ కలెక్టర్ నూరుల్ కమర్


పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

కురుపాం: ఇంటర్మీడియెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరుపై కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణను ప్రశ్నించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ హరిరమణారావు, కురుపాం తహసీల్దార్ రమేష్‌కుమార్, ఆర్ఐ ప్రసాద్ ఉన్నారు.

30న సీతారాముల కల్యాణం

- నేట నుంచి 30 వరకు శ్రీరామనవమి ఉత్సవాలు


తోటపల్లిలోని శ్రీకోదండ రామాలయం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 22 నుండి 30వరకు శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహించనున్నారు. నవరాత్రి మహోత్సవాలో భాగంగా బుధవారం నుండి ప్రతీ రోజు శ్రీరామసుప్రభాత సేవ, ఆరాధన, మంగళశాసనం, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురారోపణము తదితర పూజలను నిర్వహించనున్నారు. ప్రతినిత్యం శ్రీమద్రామాయణ పారాయణం, శ్రీరామ లక్ష్మీజపములను నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించిన మీదట ఈ నెల 30న బుధవారం ఉదయం శ్రీరామ సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, విశ్వక్షేనపూజ, ఋత్విక్‌వరుణ, రక్షాబంధనం, అంకురారోపణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఉదయం 9 గంటలకు శ్రీసీతారామస్వామివారి కల్యాణం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బి.ఎల్.నగేష్ మంగళవారం తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు తమ గోత్రనామాలతో రూ.500లు చెల్లించి కల్యాణం జరిపించుకోవచ్చునని పేర్కొన్నారు. కల్యాణం అనంతరం సాయంత్రం సీతారాములవారి పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి

- ఎంపీపీ పద్మావతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కురుపాం: మహిళలు ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుండాలని ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడవ విడతకి సంబంధించి గ్రామ స్థాయిలో అవగాహన సదస్సును వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం కిశోర్ ఆధ్వర్యంలో గుమ్మిడిగూడ, బియ్యాలవలస పంచాయతీలకు సంబంధించి దండుసూర గిరిజన గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ మహిళల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కురుపాం జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, పంచాయతీ సర్పంచులు, మహిళా సంఘాల సభ్యులు హాజరయ్యారు.